పచ్చిరొట్ట విత్తనాలేవి?

- రైతులకు అందుబాటులో లేని విత్తనాలు
- గతేడాది మాదిరిగానే ఈ సారి గందరగోళం
- సీడ్ కార్పొరేషన్‌లో నిధుల కటకట
- టెండర్ వేసేందుకు ముందుకురాని వ్యాపారులు

హైదరాబాద్, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులకు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తిప్పలు తప్పేలా లేవు. టెండర్ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యమే ఇందుకు కారణమని తెలిసింది. సాగులో రసాయనిక ఎరువులు తగ్గించేందుకు రైతులు ఆసక్తి చూపుతుంటే.. ఇందుకు విరుద్ధంగా రైతులను నిరుత్సాహపరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంటల సాగులో యూరియా, డీఏపీ వంటి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకుగానూ బీఆర్ఎస్ ప్రభుత్వం సహజ ఎరువుల వినియోగంపై దృష్టిపెట్టింది. ఏటా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేసింది. జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేయడం వల్ల పంటకు కావాల్సిన నత్రజని, బాస్వరం, పొటాషియం లభిస్తాయి. దీంతో యూరియా, ఎన్‌పీకే వినియోగం తగ్గుతుంది.

బకాయిలిస్తేనే టెండర్లు వేస్తాం..

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నది. ఈ ఏడాది 2.47 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని నిర్ణయించింది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పిలిచిన టెండర్లకు సరఫరాదారుల నుంచి స్పందన కరువైంది. ఇప్పటికే మూడుసార్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. తొలుత గత నెల 10న టెండర్లను పిలిచిన కార్పొరేషన్ దరఖాస్తుకు అదే నెల 17 వరకు గడువు ఇచ్చింది. ఆ తర్వాత మార్చి 24 వరకు పొడిగించింది. అయినప్పటికీ టెండర్లు రాలేదు. మరోసారి ఏప్రిల్ 2 వరకు గడువు పొడిగించింది. ఇప్పుడు కూడా టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. తాజాగా మరోసారి ఈ నెల 9 వరకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కూడా కేవలం ఇద్దరో, ముగ్గురో సరఫరాదారులు మాత్రమే ముందుకొచ్చినట్టుగా తెలిసింది. ఈ ఏడాది కూడా గత ఏడాది పరిణామాలు పునరావృతమయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.

దేవాదుల ఆయకట్టు ఆగమాగం

- సగం దిగుబడి వచ్చే అవకాశం
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు
- కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనంటున్న రైతులు

హనుమకొండ జిల్లా పరిధిలోని దేవాదుల ఆయకట్టులో ఎండిన వరి పొలం

హనుమకొండ సబర్బన్, ఏప్రిల్ 6 : నమ్ముకున్న దేవాదుల ప్రాజెక్టు నట్టేట ముంచింది. ప్రణాళిక లేని సర్కార్ తీరుతో అన్నదాతలు ఆగమై పోతున్నారు. ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఖాయం అనుకున్న దశలో ఒక్కసారిగా పడిపోయిన భూగర్భ జలాలకు తోడు, ప్రాజెక్టు నీళ్లు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. హనుమకొండ జిల్లాలోని కాకతీయ కాల్వ ఆయకట్టు రైతులు అటో ఇటో బయట పడే పరిస్థితి ఉన్నా, దేవాదుల ఆయకట్టు రైతులు మాత్రం తీవ్ర నష్టానికి గురయ్యారు. ఈ యాసంగిలో జిల్లాలో 1.18 లక్షల ఎకరాల్లో వరి, 55 వేల ఎకరాల్లో మక్కజొన్న వేశారు. మొత్తం 14 మండలాల్లో కమలాపూర్, నడికుడ, పరకాల, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాలు పూర్తిగా, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, హనుమకొండ మండలాలు సగం వరకు కాకతీయ కాల్వ పరిధిలో ఉన్నాయి. మిగతా ధర్మసాగర్, ఐనవోలు, ఖాజీపేట, భీమదేవరపల్లి, వేలేరు పూర్తిగా, ఎల్కతుర్తి, హసన్‌పర్తి మండలాలు కొంత మేరకు దేవాదుల ఆయకట్టు పరిధిలో ఉంటాయి. ఏటా దేవాదుల నీళ్లు క్రమం తప్పకుండా వచ్చేవి. దీనికితోడు భూగర్భ జలాలు కూడా ఎక్కువగానే ఉండేవి. రెండు వనరులు ఉండటంతో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకునేవారు. ఈ సారి ఇందుకు భిన్నంగా దేవాదుల నీరు రాలేదు. ప్రభుత్వం నుంచి ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో మెయింటెనెన్స్ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదు. దీంతో ఏకంగా 37 రోజులపాటు దేవాదుల పంపులు నడువలేదు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీళ్లు లేకపోవడంతో ఆయకట్టుకు అధికారులు నీటిని విడుదల చేయలేదు. ఈ విషయం తెలియని రైతులు పూర్తి స్థాయిలో పంటలు వేసుకున్నారు. తీరా నీళ్లు రాకపోవడంతో ఇప్పుడు ఎండిన పొలాలను చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వేసిన పంటలో సగం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

నేను 5 ఎకరాల్లో వరి వేసిన. నీళ్లు లేక రెండెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగతాది కూడా చేతికొస్తుందనే ఆశ లేదు. కిలో మీటర్ దూరం నుంచి నీళ్లు కొనుగోలు చేసి రూ.70 వేలు ఖర్చు చేసి పైప్ లైన్ వేసిన, నా పొలం దేవాదుల కాల్వ పక్కనే ఉన్నది. ఏటా తప్పకుండా నీళ్లు వచ్చేవి. నా బావి నీళ్లకు దేవాదుల నీళ్లు తోడయితే పంట పూర్తయ్యేది. ఈ సారి దేవాదుల పంపులు నడవక పోవడంతో నీళ్లు రాలేదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే. మార్పు కావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు బాగ బుద్ధి చెప్పారు.

– ఇరిగేసి మహేందర్‌రావు, రైతు, గోపాల్‌పూర్, ఎల్కతుర్తి మండలం

గుంట కూడా పండే పరిస్థితి లేదు

నాకు ఇందిరానగర్ శివారులో 1.10 ఎకరాల పొలం ఉన్నది.బోరుతోపాటు దేవాదుల నీళ్లు రాకపోతయా అని వరి నాటు వేసిన. మొన్నటిదాక మంచగనే పారింది. పొట్ట దశనుంచి ఈనే దశ వరకు బోరు బాగానే పోసింది. తీరా పూర్తిగా ఈనగానే బోరు నీళ్లు తగ్గి పోయాయి. అయినా, దేవాదుల నీళ్లు వస్తాయనే ధీమా ఉండే. ఈ సారి దేవాదుల నీళ్లు రాలేదు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి కొన్ని రోజులే నీళ్లియ్యడంతో ప్రాజెక్టు మొదటగా ఉన్న గ్రామాల రైతులే వాడుకున్నారు. మా వరకు నీటి చుక్కకూడ రాలేదు. కాల్వల వెంట ఎన్నిసార్లు తిరిగినా నీళ్లు మాత్రం రాలేదు. – పర్లపల్లి పృథ్వీరాజ్, రైతు, ఎల్కతుర్తి మండలం

కుందనపల్లిలో ఎండిన పొలంలో మేస్తున్న పశువులు

పశువుల మేతకు పంట పొలాలు

నీళ్లు అందక ఎండిన వరి

టేకుమట్ల, ఏప్రిల్ 6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లిలో చలివాగు ఒడ్డున వేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. చలివాగు పూర్తిగా వట్టిపోవడంతో సాగు నీరందక చేతికొచ్చే దశలో మాడిపోతున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా దక్కకపోవడంతో పొలాలను పశువుల మేతకు వదులుతున్నారు. ఒక్క కుందనపల్లిలోనే 80 ఎకరాల వరి ఎండిపోయినట్టు అధికారులు తెలిపారు. మరి కొందరు రైతులు అప్పు చేసి చలివాగులో జేసీబీలతో లోతైన బావులు తవ్వించుకొని పంటలకు నీరు పెట్టుకొంటున్నారు.

ముగిసిన తొలి విత్తన పండుగ

- మూల విత్తనాలను పరిశీలించిన రైతు కమిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అల్మాస్‌పల్లిలో గ్రీన్ రివల్యూషన్, భారత్ బీజ్‌స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన తెలంగాణ తొలి విత్తన పండుగ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులు తయారు చేసిన విత్తనాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. 30కిపైగా స్టాళ్లను ఏర్పాటు చేసిన రైతులు.. విత్తన తయారీలో తమ అనుభవాలను రైతు కమిషన్‌కు వివరించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. విత్తనం రైతు ప్రాథమిక హక్కు అని, కానీ, మూడు దశాబ్దాలుగా అది మల్టీనేషనల్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందని అన్నారు. ఫలితంగానే రైతు ఆత్మహత్యలు మొదలయ్యాయని పేర్కొన్నారు.

- బోరు ఇంకింది..పొలం ఎండింది



'ఈ చిత్రంలో ఎండిన పంటపొలం పశువులు మేపుతున్న రైతు పేరు లకావత్ భీమానాయక్. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం దుబ్బతండా. ఇతడు మూడెకరాల్లో వరి వేశాడు.. రైతు భరోసా సాయం అందక పెట్టుబడి కోసం బంధువుల వద్ద రూ.50 వేలు అప్పు తెచ్చిండు. దేవాదుల నీళ్లు రాక భూగర్భ జలాలు అడుగంటి బోరు మోటర్ ఆగిఆగి పోస్తుండటంతో ఎకరం పొలం మాత్రమే తడిసింది. మిగిలిన రెండెకరాలు కండ్ల ముందే ఎండిపోవడంతో పశుగ్రాసంగా ఆవులు, ఎడ్లను మేపుతున్నాడు. – జనగామ, నమస్తే తెలంగాణ

కల్వకుర్తి మండలం మార్చాలలో దీక్ష చేస్తున్న పాడి రైతు కిశోర్‌రెడ్డి

విజయ పాలసేకరణ ధరలను తగ్గించొద్దు

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతు నిరాహార దీక్ష

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 6 : పాలధర తగ్గించి రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడాన్ని నిరసిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాలకు చెందిన కిశోర్‌రెడ్డి నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయ డెయిరీ పాల ధరలను సవరించిందని చెప్పారు. ఫ్యాట్ ఎక్కువగా ఉన్న దానిపై రూ.1.50 పైసలు పెంచుతూ.. ఫ్యాట్ తక్కువగా ఉండే పాలపై ఏకంగా రూ.4 తగ్గించిందని వివరించారు. దీంతో మెజార్టీ పాడి రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. పాల ధర తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతోపాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతుభరోసా కోసం నిరసన

- మూడెకరాలు సాగు చేసినా అందలేదని ఆవేదన

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 6 : మూడెకరాల్లో సాగు చేసినా రైతు భరోసా అందలేదని రైతులు నిరసనకు దిగారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడంకు చెందిన రైతులు కాసు లింగయ్య, లింగనబోయిన కుమార్, బొంకూరి సోమయ్య, కత్తుల సంపత్, మూడెకరాల్లోపు పంట సాగు చేస్తే ఎకరం వరకే రైతు భరోసా అందించారని, మిగతా భూమికి ఇవ్వలేదంటూ ఆదివారం స్థానిక పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. మూడెకరాల వరకు సాగు చేసిన 72 మందికి రైతుభరోసా అందలేదని తెలిపారు. 652 సర్వే నంబర్‌లో సాగు చేసుకుంటున్న రైతులకు పాసుబుక్‌లు ఉన్నాయని, గత బీఆర్ఎస్ పాలనలో రైతుబీమా వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా అందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు.



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడం పంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బాజా

ఎస్బీఐ అమృత్ వృష్టి

ఆకర్షణీయ వడ్డీతో ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఈ నెల 1 నుంచి తమ పాపులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకం అమృత్ కలశ్‌ను ఆవిష్కరించింది. అయితే మరో ప్రత్యేక ఎఫ్‌డీ అమృత్ వృష్టిని కొనసాగిస్తున్నది. ఇందులో డిపాజిట్‌దారులకు మరింత వడ్డీ ఆదాయం లభిస్తుండటం విశేషం. దీని కాలపరిమితి 444 రోజులు. రెగ్యులర్ ఇన్వెస్టర్లకు వార్షిక వడ్డీరేటు 7.25 శాతం వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్లకు మాత్రం 7.75 శాతం వడ్డీ వస్తుంది. ఇక 80 ఏండ్లు దాటినవారికైతే ఇది 7.85 శాతంగా ఉండటం గమనార్హం.

ఎస్బీఐ రెగ్యులర్ ఎఫ్‌డీలపై వార్షిక వడ్డీరేట్లు (శాతాల్లో)

కాలపరిమితి	సాధారణ సిటిజన్లు	సీనియర్ సిటిజన్లు
7–45 రోజులు	3.50	4.00
46–179 రోజులు	5.50	6.00
180–210 రోజులు	6.25	6.75
211 రోజులు–ఏడాదిలోపు	6.50	7.00
ఏడాది–రెండేండ్లలోపు	6.80	7.30
రెండేండ్లు–మూడేండ్లలోపు	7.00	7.50
మూడేండ్లు–ఐదేండ్లలోపు	6.75	7.25
ఐదేండ్లు–పదేండ్లదాకా	6.50	7.00

ప్యాట్రన్స్, వుయ్–కేర్

ఎస్బీఐ పరిచయం చేసిన కొత్త టర్మ్ డిపాజిట్ సదుపాయమే ఈ 'ప్యాట్రన్స్'. 80 ఏండ్లు, ఆపై వయసు కలిగిన వారికే ఈ ప్రత్యేక ఎఫ్‌డీ అందుబాటులో ఉంటుంది. దీనిపై వార్షిక వడ్డీరేటు గరిష్ఠంగా 10 శాతం అందుకోవచ్చు. అలాగే 'వుయ్–కేర్' పేరిట 5–10 ఏండ్ల ఎఫ్‌డీలకు సీనియర్ సిటిజన్ల కోసం 7.50 శాతం వడ్డీనిస్తున్నది.

రిడెంప్షన్‌కు వేళాయె

ఎస్జీబీ ముందస్తు ఉపసంహరణల తేదీలివే.. 2017-18 సిరీస్ 3-6కు ఈ నెలలోనే దరఖాస్తులు

సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్జీబీ) 5 ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో 8 ఏండ్ల కాలపరిమితిని కలిగి ఉంటాయి. ఈ బాండ్లు కొన్న 5 ఏండ్ల తర్వాతే ముందస్తు ఉపసంహరణలకు వీలుంటుంది. అంటే 6, 7, 8 సంవత్సరాల్లో మదుపరులు ఎప్పుడైనా తమ పెట్టుబడులను వెనుకకు తీసుకోవచ్చన్నమాట. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తేదీలను ప్రకటిస్తుంది. ఈ క్రమంలోనే 2017–18 సిరీస్‌లో ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ విజ్ఞప్తులకు అర్హత ఉన్న 4 విడుతలకుగాను చివరి తేదీలు విడుదలయ్యాయి. అయితే వీటి దరఖాస్తులకున్న గడువులు ఈ నెలలోనే ముగుస్తుండటం గమనార్హం. ఎస్జీబీల్లో మదుపు చేసినవారు ఈ అవకాశాన్ని వదులుకుంటే తదుపరి ప్రకటనదాకా ఆగాల్సిందే. ఇక ఆర్బీఐ ప్రకటించిన ఆ వివరాల్లోకి వెళ్తే..

మదుపరులు ఏం చేయాలి

ఎస్జీబీల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులు రిడెంప్షన్ షెడ్యూల్‌ను జాగ్రత్తగా గమనించాలి. మనం కొన్న బాండ్లు ఏ ఆర్థిక సంవత్సరం, అందులో ఏ సిరీస్‌కు చెందినవో తప్పక తెలిసి ఉండాలి. అవి జారీ అయిన తేదీలనూ గుర్తుపెట్టుకోవాలి. అప్పుడే మనకు అవసరమైతే మెచ్యూరిటీకి ముందే రిడెంప్షన్ (బాండ్ల నగదీకరణ)కు వీలుపడుతుంది. ఇక ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఎన్ఎస్‌డీఎల్/సీడీఎస్ఎల్/ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్/రిసీవింగ్ ఆఫీసులకు పంపాలి. ఆర్బీఐ ఇచ్చిన గడువులోగా దరఖాస్తుల్ని అందజేస్తేనే రిడెంప్షన్‌కు వీలుంటుంది.

ఏమిటీ ఎస్జీబీలు?

సావరిన్ గోల్డ్ బాండ్లు అంటే ప్రభుత్వ సెక్యూరిటీలు. కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్బీఐ జారీ చేస్తుంది. ఈ బాండ్లు గ్రాముల లెక్కన ఉంటాయి. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలైతే గరిష్ఠంగా 4 కిలోలు.. ట్రస్టులు, నిర్దేశిత సంస్థలు 20 కిలోల బంగారానికి సమానంగా పెట్టుబడులు పెట్టవచ్చు. భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయంగా ఈ ఎస్జీబీలను కేంద్రం 2015 నవంబర్‌లో పరిచయం చేసింది. దేశంలో నగలు, ఇతరత్రా రూపాల్లో నిరుపయోగంగా ఉండే బంగారం పరిమాణాన్ని తగ్గించాలన్నదే ఈ బాండ్ల లక్ష్యం. ఇక మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం ధరల ఆధారంగా ఈ బాండ్ల రేట్లు, రాబడులుంటాయి. ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ఏటా 2.5 శాతం వడ్డీరేటు కూడా లభిస్తుంది. 6 నెలలకోసారి మదుపరి బ్యాంక్ ఖాతాలో జమవుతుంది. రిడెంప్షన్ తర్వాత కూడా ఖాతాలోనే తుది మొత్తాలు జమవుతాయి.

ఎస్జీబీ 2017-18 సిరీస్ 3

ఈ బాండ్ల ముందస్తు ఉపసంహరణ తేదీని ఆర్బీఐ ఏప్రిల్ 16గా నిర్ణయించింది. సిరీస్ 3లో మదుపు చేసిన ఇన్వెస్టర్లు ప్రీమెచ్యూర్ రిడెంప్షన్‌కు మార్చి 17 నుంచి ఏప్రిల్ 7 వరకు ఎప్పుడైనా విజ్ఞప్తి చేసుకోవచ్చు.

ఎస్జీబీ 2017-18 సిరీస్ 5

ఈ బాండ్ల ముందస్తు ఉపసంహరణ తేదీని ఆర్బీఐ ఏప్రిల్ 30గా నిర్ణయించింది. సిరీస్ 5లో మదుపు చేసిన ఇన్వెస్టర్లు ప్రీమెచ్యూర్ రిడెంప్షన్‌కు మార్చి 31 నుంచి ఏప్రిల్ 21 వరకు ఎప్పుడైనా విజ్ఞప్తి చేసుకోవచ్చు.

ఎస్జీబీ 2017-18 సిరీస్ 4

ఈ బాండ్ల ముందస్తు ఉపసంహరణ తేదీని ఆర్బీఐ ఏప్రిల్ 23గా నిర్ణయించింది. సిరీస్ 4లో మదుపు చేసిన ఇన్వెస్టర్లు ప్రీమెచ్యూర్ రిడెంప్షన్‌కు మార్చి 24 నుంచి ఏప్రిల్ 15 వరకు ఎప్పుడైనా విజ్ఞప్తి చేసుకోవచ్చు.

ఎస్జీబీ 2017-18 సిరీస్ 6

ఈ బాండ్ల ముందస్తు ఉపసంహరణ తేదీని ఆర్బీఐ వచ్చే నెల మే 6గా నిర్ణయించింది. సిరీస్ 6లో మదుపు చేసిన ఇన్వెస్టర్లు ప్రీమెచ్యూర్ రిడెంప్షన్‌కు ఏప్రిల్ 5 నుంచి ఏప్రిల్ 28 వరకు ఎప్పుడైనా విజ్ఞప్తి చేసుకోవచ్చు.

టారిఫ్‌లు, ఆర్బీఐ సమీక్షపైనే దృష్టి

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలతో ఉలిక్కిపడ్డాయి. వరుస నష్టాల నుంచి సూచీలు కోలుకుంటున్న తరుణంలో టారిఫ్‌ల పిడుగు వచ్చిపడింది. ప్రపంచవ్యాప్తంగా ఇది వాణిజ్య యుద్ధానికి దారితీయగా.. మదుపరుల భయాల నడుమ ఈక్విటీ మార్కెట్లు అంతటా కుప్పకూలిపోయాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,050.23 పాయింట్లు లేదా 2.64 శాతం పతనమై 75,364.69 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 614.80 పాయింట్లు లేదా 2.61 శాతం క్షీణించి 22,904.45 దగ్గర స్థిరపడింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడ్ వార్ భయాలు మార్కెట్లను వెంటాడుతాయని, ఆయా దేశాలు అమెరికా టారిఫ్‌లపై స్పందించే తీరే కీలకమని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చైనా దీటుగా స్పందించింది. తమ దేశంలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై 34 శాతం అదనపు సుంకాలుంటాయని ప్రకటించింది. ఈ క్రమంలో మరికొన్ని దేశాలూ ఇదే దిశగా వెళ్తుండగా, ఇంకొన్ని దేశాలు అమెరికాతో చర్చలకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ఈ విషయంలో భారత్ ప్రతిస్పందన కూడా స్టాక్ మార్కెట్లకు దిశా–నిర్దేశం చేయగలదు. ఇదిలావుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష కూడా కీలకమే. ఈ నెల 9న ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయాలుంటాయి. గత సమీక్షలో చాలాకాలం తర్వాత రెపో రేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా వడ్డీరేట్ల కోత ఉంటుందన్న అంచనాలే నెలకొన్నాయి. ఇదే జరిగితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లకు కొత్త ఉత్సాహం లభించినట్టే అనుకోవచ్చు. అలాకాక పోతే మాత్రం సూచీలు మరింత దిగజారే అవకాశాలే ఎక్కువ. మదుపరులపై అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు మరి. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,200–23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



ఆరోగ్య బీమాపై ట్యాక్స్ రిబేటు



ఆరోగ్య బీమా ఉంటే.. అత్యవసర సమయాల్లో దవాఖాన ఖర్చులు, వైద్య చికిత్స వ్యయాల నుంచి గొప్ప రక్షణను పొందవచ్చు. అయితే ఈ బీమా ఖరీదెక్కడంతో చాలామందికి ప్రీమియంలు భారంగా మారుతున్నాయి. దీంతో సమగ్ర ఆరోగ్య బీమా అందరికీ దక్కని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీన్ని అధిగమించేలా ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్ను మినహాయింపులను కల్పించారు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టం (1961)లోని సెక్షన్ 80డీ కింద పాలసీదారులు ప్రతీ ఆర్థిక సంవత్సరంలో తమ ఆరోగ్య బీమాకు చెల్లించే ప్రీమియంలపై ట్యాక్స్ రిబేటును కోరవచ్చు. ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఈ సదుపాయాన్ని ట్యాక్స్‌పేయర్స్ ఉపయోగించుకోవచ్చు.

- పాలసీదారులు అందరూ 60 ఏండ్లలోపుంటే వ్యక్తిగత, కుటుంబ బీమా ప్రీమియంలపై ట్యాక్స్‌పేయర్లు ఏటా రూ.25వేలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు.
- తల్లిదండ్రుల వయసు 60 ఏండ్లలోపే ఉంటే వారి కోసం ట్యాక్స్‌పేయర్ తీసుకునే బీమాపై మరో రూ.25వేలదాకా పన్ను ప్రయోజనం పొందవచ్చు. 60 ఏండ్లు దాటితే ట్యాక్స్ రిబేటు రూ.50వేలదాకా వస్తుంది.
- పాలసీదారులు అందరూ 60 ఏండ్లపైనే ఉంటే లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపు కోరవచ్చు.
- వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలకే సెక్షన్ 80డీ కింద ఈ ప్రయోజనాలుంటాయి. కంపెనీలిచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్‌లకు వర్తించవు.
- హిందూ అవిభాజ్య కుటుంబాల్లో పాలసీదారులు అందరూ 60 ఏండ్లలోపే ఉంటే రూ.25,000, ఒక్కరి వయసు 60 ఏండ్లు దాటినా రూ.50,000 పన్ను ప్రయోజనం దక్కుతుంది.
- నగదు రూపంలో ఆరోగ్య బీమా ప్రీమియంలు చెల్లిస్తే పన్ను మినహాయింపులను కోరలేము.